RNI NO:APTEL/2014/58326

# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

సంపుటి :177 పేజీలు: 04 | సంచిక :178 వెల : 01/- | 28 ఆదివారం జూన్ 2026

ఎడిషన్ ఇన్ ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి

**PUBLIC NOTICE**

My Original SSC Passed Certificate has been lost. The particulars are as follows:
Name: B. Sai Krishna
Fatherµs Name: Late Basuru Varada Rajulu
If anybody finds the above certificate, kindly return it to the undersigned or contact me at the number given below. I also request the concerned authorities to treat this publication as intimation of loss and kindly issue a Duplicate SSC Passed Certificate.

Contact: G91 9603892158
Sd/`
B. Sai Krishna

## వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా

**మార్కాపురం జిల్లాలో చంద్రబాబు పర్యటన**

**'సంజీవని' ఆరోగ్య కార్యక్రమం ప్రారంభం**

**వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని ప్రజలకు హామీ**

**గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని వెల్లడి**

**ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మేలని, యువత టెక్నాలజీపై దృష్టి పెట్టాలని పిలుపు**

**తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దానిని పూర్తి చేసి జాతికి అంకితం చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకులు కేవలం ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు.**



మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె (కె.ఎస్ పల్లె)లో శనివారం జరిగిన 'సంజీవని' కార్యక్రమ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి వంటిదని, దానిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.దప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.3,900 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు వివరించారు.పునరావాసం కింద నిర్వాసితులకు ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు.అందిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు, ఆ తర్వాత మిగిలిన ప్రాంతానికి పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, కొందరు గొడ్డలి పార్టీకి పరోక్షంగా పనిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు.యువత ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు నేర్చుకొని భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## రౌడీయిజం చేసేందుకు వెళ్లారా?-అనిత

- వైసీపీ నేతలను అడ్డుకున్న అమరావతి రైతులు
- అమరావతిలో అడుగుపెట్టే అర్హత వైసీపీ నేతలకు లేదన్న అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్నది భూములిచ్చిన రైతులేనని వెల్లడి

ఉండవల్లిలో వైసీపీ నేతల (పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్) పర్యటన సందర్భంగా జరిగిన రాళ్లదాడిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అమరావతిలో అడుగుపెట్టే కనీస అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. వారు రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రౌడీయిజం చేయడానికా అని ప్రశ్నిస్తూ... వారి వెంట ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారో పోలీసుల వద్ద పక్కా లిస్ట్ ఉందని చెప్పారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారు కూడా వైసీపీ నేతల వెంట వచ్చారని... విజువల్స్ లో అందరూ ఉన్నారని తెలిపారు. వైసీపీ నేతలకు వ్యతిరేకంగా అక్కడ నిరసన తెలిపిన వారిలో 90 శాతం మంది రాజధాని కోసం భూములిచ్చిన అసలైన రైతులేనని స్పష్టం చేశారు.



## భాగ్యరాజ్ ఆత్మకు శాంతి చేకూరాలి-జగన్

- గుండెపోటుతో మృతి చెందిన దర్శకనటుడు భాగ్యరాజ్
- సినీ రంగంపై భాగ్యరాజ్ చెరగని ముద్ర వేశారన్న జగన్



సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని వ్యాఖ్య ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత కె. భాగ్యరాజ్ మృతిపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంతాపం వ్యక్తం చేశారు. జగన్ తన సంతాప సందేశంలో... "రచయితగా, సహాయ నటుడిగా సినీ జీవితం ప్రారంభించిన భాగ్యరాజ్ తన అసాధారణ ప్రతిభతో తమిళ సినిమా పరిశ్రమలో దర్శకుడిగా, హీరోగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. భారతీయ సినిమా రంగంపై ఆయన చెరగని ముద్ర వేశారు" అని పేర్కొన్నారు. ఆయన దర్శకత్వం వహించిన, కథ-స్క్రీన్‌ప్లే అందించిన అనేక చిత్రాలు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఘన విజయాలు సాధించాయని గుర్తు చేశారు.

## 194 ఏళ్ల తాబేలును కలుసుకోనున్న మోదీ



వచ్చే వారం సీషెల్స్‌లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు. ఆ సమయంలో అక్కడ బోటానికల్ గార్డెన్‌లో ఓ మొక్కను ఆయన నాటనున్నారు. ఆ తర్వాత ప్రాణాలతో జీవిస్తున్న వృద్ధ తాబేలును ఆయన కలుసుకోనున్నారు. ఆ తాబేలు వయసు 194 ఏళ్లు. హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్ వెళ్లనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ కలుసుకోనున్నారు.

# ఉపాధి హామీకి ఉరి బిగిస్తున్న 'విబి-జిరామ్‌జి' చట్టం!

## 125 రోజుల హామీ -25 రోజుల మోసం!

**పేరు మార్చారు.. ఊపిరి తీశారు - ఇదే మోడీ గ్యారంటీ!**

**ప్రచారం కేంద్రానిది, ఖర్చు రాష్ట్రాలది "ఇదేం న్యాయం సామీ!"**

**"పని అడిగితే పని ఇవ్వాలి" అన్నది పోయి, "నిధులు ఉంటేనే పని" అనే రూల్ తెచ్చిన కేంద్రం**



నవతరం ప్రతినిధి, పలాస, జూన్ 27: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా '125 రోజుల ఉపాధి' పేరుతో తీసుకువస్తున్న చట్టంపై ప్రముఖ సామాజిక వేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆందోళన వ్యక్తం చేస్తూ 'నవతరం' ప్రతినిధితో ఇంటర్వ్యూలో మాట్లాడారు. **నవతరం' ప్రతినిధితో ప్రముఖ సామాజిక వేత్త దువ్వాడ శ్రీధర్(బాబా) ఇంటర్వ్యూ :**

**ప్రశ్న: విబి-జిరామ్‌జి పథకం అసలు లక్ష్యం ఏమిటి? ఉపాధి హామీని ఎలా దెబ్బతీస్తోంది?**

దువ్వాడ శ్రీధర్: ఇది పథకం కాదు, ఉపాధి హామీ చట్టానికి సమాధి కట్టే కుట్ర. "చెట్టును నరికి నీడ ఇస్తామన్నారు, ఇప్పుడు చెట్టుతో పాటు నేలనూ లాగేస్తున్నారు!" జూలై ఒకటి నుంచి అమల్లోకి తెచ్చేందుకు రూపొందించిన డ్రాఫ్ట్ రూల్ జిఎస్ఆర్ 403-ఇ ప్రకారం ఉపాధి హామీ హక్కు ఆధారిత స్వభావాన్ని పూర్తిగా బలహీనపరుస్తోంది. యాభై ఐదుకు పైగా ప్రధాన క్లాజులు, వందలాది ఉప నిబంధనలతో కొత్త పరిపాలనా నిర్మాణాన్ని తెచ్చి, హక్కును కోటాగా మార్చేసింది. **"హామీ కేంద్రానిది, ప్రచారం కేంద్రానిది, ఖర్చు మాత్రం రాష్ట్రాలది - ఇదేం న్యాయం సామీ!"**

**ప్రశ్న: 125 రోజుల హామీకి నిధులు ఎంత కావాలి? కేంద్రం కేటాయింపు ఎంత? లోటు ఎంత?**

**దువ్వాడ శ్రీధర్: "ఎద్దు ఇస్తానని తాడు చేతిలో పెట్టారు.. 125 రోజులని గడ్డి చేతిలో పెట్టారు!"** 125 రోజుల ఉపాధికి 17 ప్రధాన రాష్ట్రాల్లోని 7.69 కోట్ల యాక్టివ్ జాబ్ కార్డులకు రూ.3.61 లక్షల కోట్లు అవసరం. కానీ కేంద్రం బడ్జెట్‌లో కేవలం రూ.95 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. కేంద్ర వాటా రూ.85,605 కోట్లు, రాష్ట్రాల వాటా రూ.57,071 కోట్లు కలిపినా మొత్తం రూ.1.43 లక్షల కోట్లు మాత్రమే. ఈ నిధులతో సగటున 48.5 పనిదినాలు మాత్రమే ఇవ్వగలరు. హర్యానాలో 23, మహారాష్ట్రలో 24 పని దినాలు మాత్రమే. అంటే రూ.2.18 లక్షల కోట్లకు పైగా లోటు ఉంది.కేంద్రం అదనంగా పైసా నిధులు ఇవ్వబోమని రూల్స్‌లో కుండబద్దలు కొట్టింది. ఈ లోటును రాష్ట్రాలే భరించాలి. అంటే కేంద్రం 30 శాతం, రాష్ట్రాలు 70 శాతం ఖర్చు చేయాలి.



**ప్రశ్న: రూల్-4 లోని మార్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమా? కార్మికుల హక్కు ఏమవుతుంది?**

**దువ్వాడ శ్రీధర్:** ఇదే అత్యంత ప్రమాదకరమైన మార్పు. "పని అడిగితే పని ఇవ్వాలి అన్నది పోయి, నిధులు ఉంటేనే పని అనే రూల్ తెచ్చారు!" ఎంజిఎన్ఆర్ఈజిఎ చట్టం ప్రకారం పని డిమాండ్ ఉంటే ప్రభుత్వం నిధులు సమకూర్చాలి. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 - జీవించే హక్కులో భాగం. కానీ కొత్త రూల్-4 పని హక్కును బడ్జెట్ పరిమితికి కట్టిపడేస్తోంది. ముందు డిమాండ్‌కు

మిగతా 3 లో

# గిరిజన ఆశ్రమ పాఠశాలల మూసివేత నిర్ణయం నిలిపివేయాలి

- రేషనలైజేషన్ మెమోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- ప్రిన్సిపల్ సెక్రటరీపై చర్యలు తీసుకుని బదిలీ చేయాలని వినతి
- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకుల వినతిపత్రం



**నవతరం పాతపట్నం**

రేషనలైజేషన్ పేరుతో గిరిజన ఆశ్రమ పాఠశాలలను మూసివేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేసిన మెమోను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ్. యోగి డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాబ్. యోగి మాట్లాడుతూ, రాష్ట్రంలోని కొండ, కోన ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసి విద్యార్థులకు విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విధానాలను అమలు చేశాయని, ప్రస్తుతం కొందరు అధికారులు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఆ లక్ష్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతోనే కొందరు అధికారులు గిరిజన విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రేషనలైజేషన్ అమలైతే పాతపట్నం నియోజకవర్గంలోని సవర సిద్ధమునుగు, బైదలాపురం, గొట్టిపల్లి తదితర గిరిజన ఆశ్రమ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని 47 గిరిజన ఆశ్రమ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. తల్లిదండ్రుల అనుమతి లేకుండానే కొందరు విద్యార్థులను ఇతర పాఠశాలలకు మార్చుతున్నారని, దీంతో గిరిజన విద్యార్థులు చదువు మానేసే (డ్రాప్‌అవుట్) పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఇతర పాఠశాలలకు మార్చిన విద్యార్థులను తిరిగి వారి పాత ఆశ్రమ పాఠశాలల్లోనే చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి బైదలాపురం సింహాచలం, మెలియాపుట్టి మండల అధ్యక్షుడు గణేష్, కమిటీ సభ్యుడు వాసు, సవర సిద్ధమునుగు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ పి ఎస్ క్విట్ ఇండియా

సి పి ఎస్ రద్దు కోసం దేశ వ్యాప్త ఉద్యమం

ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్ తెలంగాణ అధ్యక్షులు

మాచన రఘునందన్



**నవతరం ప్రతినిధి,**

పాత పింఛను పథకం అమలు. న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలన్న డిమాండ్ తో.. జాతీయ స్థాయిలో ఉద్యోగులు సంఘటితం అవుతున్నారని ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాచన రఘునందన్ తెలిపారు.శనివారం నాడు ఆయన ఎల్ బి నగర్ లో మాట్లాడుతూ..కొత్త పింఛను పథకం రద్దు కోసం పోరాటం చేస్తున్న పలు సంఘాలు జులై మొదటి వారం లో డిల్లీ లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రఘునందన్ వివరించారు.వన్ రేషన్ వన్ నేషన్,వన్ ఎలక్షన్ వన్ నేషన్ అని గొప్పగా చెప్పుకునే మనం వన్ నేషన్ వన్ పెన్షన్ అనే నినాదం తో.. ఉద్యోగులు గళం వినిపించనున్నట్లు రఘునందన్ వివరించారు.పదవి విరమణ తర్వాత పింఛను రాని కొలువు కన్నా..ఆకర్షణీయమైన వేతనం వచ్చే ప్రైవేటు ఉద్యోగమే మిన్న అనే భావన ఉద్యోగుల్లో, నిరుద్యోగుల్లో నెలకొందని రఘునందన్ అవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పార్టీలు,పాలకులు ఎప్పటికప్పుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ.. ఓ పి ఎస్ ఇస్తాం. సి పి ఎస్ రద్దు చేస్తాం అని అంటున్నాయే తప్ప ఎన్నికల తర్వాత తాము ఇచ్చిన హామీల సంగతే మర్చి"పోతున్నారని" రఘునందన్ విస్మయం వ్యక్తం చేశారు. హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పాత పింఛను పథకం అమలు చేస్తున్నారని రఘునందన్ వివరించారు."మేం న్యూ పెన్షన్ స్కీమ్ నుంచి బయటకు వచ్చేస్తాం" అని ఆయా రాష్ట్రా ప్రభుత్వాలు సి పి ఎస్ స్కీమ్ నుంచి ఎగ్జిట్ కావచ్చని "మాచన" అన్నారు. ఉద్యోగుల డబ్బు తో.. ప్రభుత్వాలు జూదం ఆడుతున్నాయి అని జన సామాన్యం భావించేలా ప్రభుత్వాలు ఎంత సేపు పాత పింఛను పథకం కంటే కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉత్తమం అని మాయ మాటలు చెప్పి ఉద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని రఘునందన్ అభిప్రాయపడ్డారు.అందుకే పాలకులకు తమ గోడు వినిపించడానికి జాతీయ స్థాయిలో ఉద్యోగ సంఘాల అన్ని ఏకమై "ఎన్ పి ఎస్ క్విట్ ఇండియా" అని నినదించనున్నట్టు రఘునందన్ స్పష్టం చేశారు.ఆనాడు గాంధీ జీ క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించిన తీరులోనే ఈ ఆందోళన కొనసాగే అవకాశం లేకపోలేదని "మాచన" అన్నారు.

# ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్తే లక్ష్యం





**వరల్డ్ ఎంఎస్ఎంఈ డే సందర్భంగా పెందుర్తిలో ఘనంగా వేడుకలు**

**స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధితో యువత ముందుకు రావాలని పిలుపు**

**క్లాత్ బ్యాగుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం**

**నవతరం ప్రతినిధి, విశాఖపట్నం**

ప్రపంచ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవం (వరల్డ్ ఎంఎస్ఎంఈ డే) సందర్భంగా విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చిన్న ముసలివాడలోని అమృత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రాంగణంలో ఎంఎస్ఎంఈ ర్యాంప్ కార్యక్రమం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వయం ఉపాధి అవకాశాలపై యువత, మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సందేశాన్ని అందించారు.కార్యక్రమానికి ౨౧=జుణ్ణ×ుఎంఎస్ఎంఈ ర్యాంప్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి జి. అరుణ్ కుమార్ అధ్యక్షత వహించగా, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషులు, ఎంవీఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. వెంకట్రావు, అమృత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ శామ్యూల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జి. అరుణ్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు యువత, మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ ర్యాంప్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషులు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నైపుణ్యాభివృద్ధి సాధించి పరిశ్రమల స్థాపన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలు, రుణ సదుపాయాలను వినియోగించుకుని స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని అన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఎంవీఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. వెంకట్రావు మాట్లాడుతూ చదువు, వయస్సు, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా గృహ పరిశ్రమలు ప్రారంభించి ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా క్లాత్ బ్యాగుల వినియోగం పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. మహిళలు ఇంటి నుంచే పరిశ్రమలు ప్రారంభించేందుకు తమ సంస్థ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులకు క్లాత్ బ్యాగులు, మొక్కలను పంపిణీ చేసి మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ట్రైనర్ ధన్య శ్రీ రాజు, కోఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు గురువులను ఆదర్శంగా తీసుకోవాలి

- విద్యావేత్త డా. జామి.బీమశంకర్
- తమ్మినేని.ఉషరాణి ఆధ్వర్యంలో విద్య కిట్లు పంపిణీ (అరసవల్లి కూడలి -)



**నవతరం ప్రతినిధి,**

ప్రతీ విద్యార్థి గురువులను ఆదర్శంగా తీసుకోవాలని, వక్త, విద్యావేత్త డా. జామి.బీమశంకర్ అన్నారు. స్థానిక అరసవల్లి కూడలిలోగల చైతన్య సహకార జూనియర్ కళాశాలలో, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షురాలు జెఎఫ్ఏ తమ్మినేని.ఉషరాణి ఆధ్వర్యంలో పదవతరగతి, ఇంటర్ విద్యార్థులకు విద్యా కిట్లతోపాటు, పరీక్ష కిట్లను అందజేశారు. ఇందులో భాగముగా జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి.బీమశంకర్ మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను ప్రోత్సాహిస్తే, మిగతా విద్యార్థులు ప్రేరణ పొందుతారని, ఆ సదుద్దేశంతో అధ్యక్షురాలు తమ్మినేని.ఉషారాణి ఆలోచనతో ఈ కార్యక్రమం రూపందాల్చిందన్నారు. తమ్మినేని.ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులకు ఏదో ఒక రూపంలో ప్రోత్సాహాన్ని అందించాలని, అప్పుడే వారిలో పోటీతత్వం వస్తుందని, గురువు జామి.బీమశంకర్ కుమార్తె విద్యాధరి అందించిన సహకారంతో మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అడ్వైజర్ మణిశర్మ, ఏఎస్ఐ అరుణ కుమారితో కలసి మాట్లాడుతూ విద్యాధరి ఇదే కళాశాలలో చదివి, మైక్రోసాఫ్ట్ లో సుమారు 50 లక్షల పారితోషకం అందుకుంటుందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు ముప్పై మంది విద్యార్థులకు, అథిధులుచే కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ, డైరెక్టర్ రౌతు.శ్రీనివాస్, శక్తీ టీం సభ్యులు సంధ్యారాణి, హాఫీజ, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఇతర సభ్యుల బృందం పాల్గొన్నారు.

# పోలియో నిర్మూలనే రోటరీ లక్ష్యం

**నవతరం ప్రతినిధి,**




రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో స్థానిక హెచ్ బీ కాలనీలో గల రోటరీ వనంలో పోలియో నిధుల సేకరణ మరియు పల్స్ పోలియో కార్యక్రమం కోసం రోటరీ క్లబ్ శ్రీకాకుళం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లబ్ అధ్యక్షులు బరాటం శ్రీనివాస మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా పోలియో ని అంతం చేయడమేనని లక్ష్యంగా పనిచేస్తుంది అన్నారు. రోటరీ అంతర్జాతీయ సంస్థ ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, బిల్ గేట్స్ ఫౌండేషన్, అలాగే ప్రభుత్వం సంస్థలతో కలసి పనిచేస్తూ ఇప్పటివరకు పోలియో నిర్మూలనకు రోటరీ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 30 వేల కోట్ల పైచిలుకు ఖర్చు చేసిందన్నారు. ఈ ఏడాది రోటరీ జిల్లా 3020 పోలియో నిర్మూలనకు రెండు కోట్లు నిధులు సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 50 లక్షలు సేకరించిందన్నారు. భారతదేశంలో పోలియో నిర్మూలన అయినప్పటికీ పాకిస్తాన్ ఆఫ్ గనిస్తాన్ వంటి దేశాల్లో పోలియో వ్యాధి ఉండటం వల్ల పొంచివున్న ప్రమాదంగా భావించి శతశాతం పల్స్ పోలియో కార్యక్రమం జరిగేటట్లు రోటరీ సంస్థలు పనిచేస్తూ నిధులు సేకరణ చేస్తుందన్నారు. ఈ ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం లో ఐదు సంవత్సరాలు లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసేటట్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కిల్లాన శ్రీనివాసరావు ,నేతాడ వెంకటరావు, అన్నపు అనంతరావు, ఎంఆర్కే దాస్, డి శివశంకర్, జైశ్రీరామ్ ,డా.మంత్రి వెంకటస్వామి ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై నిఘా

**ఇచ్ఛాపురం, జూన్ 26**



'ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం పురుషోత్తపురం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలి. గంజాయి, గుట్కా, ఒడిశా మద్యం లాంటి మాదకద్రవ్యాలు తరలిపోకుండా అప్రమత్తంగా ఉండాల'ని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి పోలీసు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం పురుషోత్తపురం చెక్‌పోస్టును ఐజీ ఆకస్మికంగా తనఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీ, రికార్డులను పరిశీలించారు. ఒడిశా నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. రాత్రివేళ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిషేధిత వస్తువులు రవాణా కాకుండా.. మరింత నిఘా పెంచి.. అనుమానాస్పదంగా కనిపించిన వాహనదారులను తనిఖీ చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నమనాయుడు, పట్టణ ఎస్సై ముకుందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభినవ అక్షర జ్యోతి అంబేద్కర్



**- ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు..**

**( ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి 88 వ పుట్టినరోజు సందర్భంగా నాకవితాంజలి )**

పద్మశ్రీ ఆచార్య
కొలకలూరి ఇనాక్ గారంటే..?
గుడిసె గుండెలో
రగిలే ఒక అగ్ని పర్వతం
కలంతో కన్నీటి కడలిని
కదిలించిన కవి చంద్రులు...

కులంగోడలపై సమానత్వపు
సూర్యోదయాన్ని చిత్రించిన రవివర్మ
ఆది ఆంధ్రుడిగా అణగారిన
అమాయకపు ఆత్మలకు ఆశాకిరణం...

అమ్మ తలలేనోడి ఆవేదనను
అక్షరార్చన చేసిన అక్షర యజ్ఞం...

భక్తితో మునివాహనుడిగా
మారిన సమానవత్వపు రథ సారథి
నూట ఎనిమిది గ్రంథాల నవనీతంతో
తెలుగు కళామతల్లికి నుదుట సాహితీ
తిలకం దిద్దిన భరతమాత ముద్దుబిడ్డ...

తరతరాలుగా
అంటరానితనపు
అగ్నిగుండంలో పడి
దళితజాతి విలవిలలాడిన
మలమలమాడిన వేళ...

అంబేద్కర్ రాజ్యాంగ
రాజకీయ రణరంగంలో
సమానత్వపు శంఖారావం పూరిస్తే...

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు
అక్షరాలను ఖడ్గాలుగా మలిచి
సాహిత్య సమరాంగణంలో
తరతరాల బానిస సంకెళ్లను తెంచిన
కలం వీరుడు సాహితీ సమరయోధుడు

సాహితీ దిగ్గజం...సాహితీ శిఖరం
శ్రీ కొలకలూరి ఇనాక్ గారి కలం నుండి
జాలువారింది 108 గ్రంథాలు కాదు
అవి నూట ఎనిమిది నిప్పుకణికలు...

ప్రతి కథ ఒక కన్నీటి చరిత్ర...
ప్రతి నాటకం ఒక నిరసన నినాదం...
ప్రతి కథ కవిత ఒక ఆత్మగౌరవ జెండా...

కాలాన్ని ప్రశ్నించిన కవి...
వేదికలకు వెలుగైన మహావక్త
సమాజాన్ని ప్రక్షాళనం చేసిన
సాహితీ సంఘసంస్కర్త...

తాడిత పీడిత బడుగు
బలహీన బహుజన వర్గాల్లోని
కష్టజీవుల కన్నీటి గాథలను
అగ్గిరవ్వల్లా అక్షరాల్లో నిక్షిప్తం చేసి
ప్రపంచానికి దారి చూపిన సాహితీ స్రష్టకథకు కరుణ...
నాటకానికి నాడి...
విమర్శకు వివేకం...
గేయానికి గుండెచప్పుడు...
పద్మశ్రీ ఆచార్య కొలకలూరు ఇనాక్ గారు

గేదెల కాపరి స్థాయి నుంచి
విశ్వవిద్యాలయ శిఖరాల వరకు
కసితో స్వయంకృషితో స్వర్ణసోపానాలు
చెక్కినా ఎక్కినా బహుముఖ ప్రజ్ఞాశాలి

దళితుల కన్నీటిని దివిటీలుగా
మార్చిన దళిత దీపస్తంభం...

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు
ఒక వ్యక్తి కాదు ఒక శక్తి ఒక చైతన్యం
సమాజంలో సమానత్వపు
ప్రేమదీపాలను వెలిగించిన అక్షర జ్యోతి...

అవమానాల అగ్నిని...
అవార్డుల అరుణోదయంగా
మార్చుకున్న మహామనీషి
ఆత్మీయతను ఆభరణంగా
ధరించిన అక్షరయోగి...
అభినవ అంబేద్కర్...

చిరునవ్వును చిరునామాగా
చేసుకున్న చైతన్యమూర్తి...
ప్రేమను పరిమళంగా పంచే
సాహితీ కురువృద్ధులు...
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు

88వ జన్మదిన శుభాకాంక్షలతో
వెయ్యేళ్లు వెలిగే ఆ అక్షరదీపానికి
నా వినమ్ర నమస్సుమాంజలి...



**రచన:**
**కవిరత్న**
**సాహిత్య ధీర**
**సహస్ర కవి భూషణ్**
**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**

# ఉపాధి హామీకి ఉరి బిగిస్తున్న 'విబి-జిరామ్‌జి' చట్టం!

అనుగుణంగా నిధులు ఉండేవి, ఇప్పుడు నిధులు ఉంటేనే పని. హక్కు నుండి కోటాకు మార్చివేశారు. వేతనాలు 15 రోజుల్లో ఇవ్వకపోతే పరిహారం, నిరుద్యోగ భృతి చెల్లించకపోతే చర్య వంటి నిబంధనలకు ఈ డ్రాఫ్ట్‌లో సమాధానం లేదు.

**ప్రశ్న: ఈ-కెవైసి, ముఖ గుర్తింపు వంటి డిజిటల్ నిబంధనలు గ్రామీణ భారతానికి ఎంతవరకు ఆచరణీయం?**

**దువ్వాడ శ్రీధర్:** "సర్వర్ పనిచేయకపోతే హాజరు లేదు, వేలిముద్ర పడకపోతే వేతనం లేదు – ఇది ఉపాధి హామీ కాదు, సాంకేతిక బానిసత్వం!" ఈ-కెవైసి, ముఖ గుర్తింపు, ఎన్ఎంఎంఎస్, ఆధార్ ధృవీకరణను ఆధునికీకరణ పేరుతో తప్పనిసరి చేశారు. కానీ దేశంలో 40% గ్రామాలకు సరైన నెట్‌వర్క్ లేదు. ఏపీలోని కాకినాడలో ఆన్‌లైన్ హాజరు కోసం రోడ్డు పక్కన నిలబడిన ఐదుగురు మహిళా కార్మికులు లారీ ఢీకొని చనిపోయారు. రూల్ 7 ప్రకారం ఈ-కెవైసి పూర్తి చేసిన జాబ్ కార్డులనే చెల్లుబాటుగా గుర్తిస్తారు. సాంకేతిక సమస్యలతో ఇప్పటికే 5 కోట్లకు పైగా జాబ్ కార్డులు రద్దయ్యాయి. పని హక్కు కార్మికుడి చేతిలో లేదు, సాంకేతిక వ్యవస్థల చేతిలో ఉంది.

**ప్రశ్న: గ్రామసభలు, పంచాయతీల అధికారాలను ఈ కొత్త విధానం ఎలా కాలరాస్తోంది?**

**దువ్వాడ శ్రీధర్:** ఉపాధి హామీని గ్రామసభను కేంద్రంగా ఉంచి నిర్మించారు. పనుల ఎంపిక, ప్రాధాన్యతలు, సామాజిక తనిఖీలు ప్రజల భాగస్వామ్యంతో జరగాలన్నది దాని ఆత్మ. కానీ కొత్త వ్యవస్థలో గ్రామసభల పాత్ర నామమాత్రం చేస్తున్నారు. రూల్ 3 ప్రకారం కౌన్సిల్ సభ్యులను కేంద్రమే నామినేట్ చేస్తుంది. కార్మిక సంఘాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం లేదు. రూల్ 4 ప్రకారం జాతీయ స్టీరింగ్ కమిటీలో కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులకే స్థానం. పనుల ఎంపిక నుంచి నిధుల కేటాయింపు వరకు అన్ని అధికారాలు ఈ కమిటీకే. దళిత, గిరిజన, మహిళా కార్మిక సంఘాలు, గ్రామీణ ప్రజా సంఘాలకు ప్రాతినిధ్యం లేదు. "మా గురించి మేం లేకుండా నిర్ణయాలు" అనే పరిస్థితిని ఈ డ్రాఫ్ట్ చట్టబద్ధం చేస్తోంది. 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి ఇది విరుద్ధం. ?

**ప్రశ్న: మహాత్మా గాంధీ పేరు తొలగింపు సాధారణమైనదేనా? దాని వెనుక రాజకీయం ఏమిటి?**

**దువ్వాడ శ్రీధర్:** "గాంధీ పేరు తీసేశారు.. గ్రామాల నోట్లో మట్టి కొట్టేశారు!" ఇది సాధారణ పేరు మార్పు కాదు. మహాత్మా గాంధీ పేరు గ్రామ స్వరాజ్యం, వికేంద్రీకరణ, గ్రామసభల పాత్ర, ప్రజల భాగస్వామ్యానికి ప్రతీక. ఆ పేరు తొలగించడం అంటే ఆ తత్వాన్నే తొలగించడం. "ముందు బోర్డు మార్చారు, ఇప్పుడు ఇల్లు కూల్చేస్తున్నారు – ఇది పేరు మార్పు కాదు, పేదోడి బతుకు మార్పు!" ఇది స్పష్టమైన హిందూత్వ ఎజెండా. గాంధీ కలలు కన్న గ్రామీణ భారతాన్ని, కార్పొరేట్ భారతంగా మార్చే కుట్ర ఇది.

**ప్రశ్న: ఈ విధానం మహిళలు, దళితులు, ఆదివాసీలపై ఎలాంటి ప్రత్యేక ప్రభావం చూపుతుంది?**

**దువ్వాడ శ్రీధర్:** ఉపాధి హామీలో 57% మంది మహిళలే. 40% కంటే ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీలే. దళిత, ఆదివాసీ కుటుంబాలకు ఇదే జీవనాధారం. ఈ-కెవైసి, ముఖ గుర్తింపు వంటివి వీరినే ఎక్కువగా దెబ్బతీస్తాయి. ఫోన్ లేని, నెట్‌వర్క్ అందని మారుమూల తండాలు, గూడేల్లోని ఆదివాసీ మహిళ పని కోల్పోతుంది. కుల వివక్షతో పని స్థలంలో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న దళిత కార్మికుడికి ఇక పని దొరకడం కష్టం. వేతనాల్లో లింగ వివక్ష లేకపోవడం వల్ల మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా పోతుంది. పని హక్కును సాంకేతికతతో ముడిపెట్టడం అంటే అట్టడుగు వర్గాలను వ్యవస్థ నుంచి గెంటేయడమే.

**ప్రశ్న: ఈ డ్రాఫ్ట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజలు, ప్రజా సంఘాలు ఏం చేయాలి?**

**దువ్వాడ శ్రీధర్:** ఇది యాదృచ్ఛిక మార్పు కాదు. దీని వెనుక ఒక నిర్దిష్ట వర్గ దృక్పథం ఉంది. గ్రామీణ పేదలు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, వ్యవసాయ, రైతు, కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు విశాల ఐక్య వేదికలను నిర్మించాలి. ప్రతి గ్రామసభలో ఈ డ్రాఫ్ట్‌ను తిరస్కరిస్తూ తీర్మానాలు చేయాలి. జూలై 1 కంటే ముందే దేశవ్యాప్తంగా నిరసనలు తెలపాలి. "పేదోడి బతుకు మార్పు"కు పూనుకున్న ఈ కుట్రను ప్రజా ఉద్యమాలతోనే అడ్డుకోవాలి. ఉపాధి హామీని హక్కుగా కాపాడుకోవడం కోసం ప్రతి గ్రామం ఉద్యమించాలి. పార్లమెంట్‌లో ఈ డ్రాఫ్ట్‌ను అడ్డుకోవాలని ఎంపీలపై ఒత్తిడి తేవాలి. లేకపోతే రేపు మన బిడ్డలకు తినడానికి తిండి కూడా ఉండదు. హక్కుల కోసం పోరాడితేనే బతుకులు నిలబడతాయి.

# ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి డిజిటలైజేషన్ చేయించుకోవాలి**
**- జూలై 14లోగా ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి**
**-పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని పిలుపు**

**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం, జూన్ 27:**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొని ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి డిజిటలైజేషన్ చేయించుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, కురుపాం నియోజకవర్గ అబ్జర్వర్, శ్రీకాకుళం జిల్లా నందమూరి బాలకృష్ణమోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడు, జిల్లా ఎన్టీఆర్‌మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ కోరారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఎన్నికల సంఘం నియమించిన బీఎల్ఓలు (బూత్ లెవల్ అధికారులు), రాజకీయ పార్టీల తరఫున నియమితులైన బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ, డిజిటలైజేషన్ ప్రక్రియను చేపడుతున్నారని తెలిపారు.ప్రతి ఓటరు ఫారాన్ని పూర్తిగా నింపి, రంగు పాస్‌పోర్టు సైజు ఫోటోను అతికించి సంబంధిత బీఎల్ఓ లేదా బీఎల్ఏకు అందజేయాలని సూచించారు.



ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఎన్నికల సంఘం రూపొందించే తుది ఓటర్ల జాబితాలో పేరు నమోదవుతుందని చెప్పారు. ఈ రోజు, ఆదివారం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, ఇంకా ఫారాలు అందని వారు లేదా పూర్తి చేసిన ఫారాలను సమర్పించని వారు వెంటనే సంబంధిత కేంద్రాలను సంప్రదించాలని కోరారు. సోమవారం నుంచి జూలై 14 వరకు కూడా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఈ ప్రక్రియను కొనసాగిస్తారని తెలిపారు. విలువైన ఓటు ప్రజాస్వామ్యానికి పునాదని, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పన ప్రతి పౌరుడి బాధ్యత అని వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించాలి

**- ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో 'ఫ్యూచర్ రెడీ ఆంధ్ర స్టూడెంట్స్ వెల్ఫేర్' ఆధ్వర్యంలో కార్యక్రమం**
**- సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని సూచన**
**- సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పిలుపు**

**నవతరం ప్రతినిధి**



కాకినాడ నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్యూచర్ రెడీ ఆంధ్ర స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె. శివశంకర్, సెక్ శ్రీ సూపరింటెండెంట్ ఎల్. రేఖ, వన్‌టౌన్ ఎస్ఐ బి. రామారావు, ఏఎస్ఐ వి. అప్పలనాయుడు, ఫ్యూచర్ రెడీ ఆంధ్ర స్టూడెంట్స్ వెల్ఫేర్ వ్యవస్థాపకుడు మణిబాబు, కోఆర్డినేటర్ గుణశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువత సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. చాలా మంది సైబర్ మోసాలకు గురైనప్పటికీ సరైన అవగాహన లేక పోలీసులకు ఫిర్యాదు చేయకుండా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, సోషల్ మీడియా వేదిక విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే పోలీసులను లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పైడిరాజు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సంకుజోడు ప్రధాన కాలువ పూడికతీత పనుల పరిశీలన

**● సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన మండల అధ్యక్షుడు దుర్యోధన గారు.!**



నవతరం పలాస

పలాస నియోజకవర్గ పరిధిలోని మందస మండలం కొండలోగాం నుంచి సంకుజోడు వరకు జరుగుతున్న ప్రధాన కాలువ పూడికతీత పనులను మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన గారు శనివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును, వేగాన్ని ఆయన క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బావన దుర్యోధన గారు మరియు స్థానిక నాయకులు బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఈ పనులపై సోషల్ మీడియా వేదికగా కొంతమంది కావాలనే అవాస్తవాలను, దుష్ప్రచారాన్ని సాగిస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కాలువ పూడికతీత పనులు చాలా చక్కగా, ఎక్కడా రాజీ పడకుండా ముమ్మరంగా సాగుతున్నాయని వారు స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పనులపై ఇలాంటి అవాస్తవాలు మాట్లాడటం మరియు లేనిపోని వదంతులు సృష్టించడం సరికాదని వారు మండిపడ్డారు. రైతాంగానికి మేలు చేసేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ ముంజేటి, ఔగాన ఈశ్వర్ రావు,దీ. మురళి మరియు స్థానిక రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తు పరిరక్షణే దేశ ప్రగతికి పునాది

**● ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యువ గళం' కార్యక్రమం**

**● రాహుల్ గాంధీ ప్రసంగాన్ని విద్యార్థులకు ప్రొజెక్టర్‌పై ప్రదర్శన**



నవతరం, శ్రీకాకుళం

ఏఐసీసీ, ఏపీసీసీ పిలుపు మేరకు శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ అధ్యక్షతన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పాల్గొన్న పత్రికా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాహుల్ గాంధీ 'యువ గళం' కార్యక్రమంలోని ప్రసంగాన్ని ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ముందుగా డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు మాట్లాడుతూ, దేశ యువతను చైతన్యవంతం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారి శక్తి, సామర్థ్యాలను నిర్వీర్యం చేయడం దేశ అభివృద్ధికి ప్రమాదకరమని పేర్కొన్నారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ యువత, విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా దేశం ముందుకు తీసుకువస్తున్నారని అన్నారు. నిరుద్యోగం పెరుగుదల, పోటీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీలు, ముఖ్యంగా నీట్ పరీక్షలో చోటుచేసుకున్న పరిణామాలు విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల పేరిట తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం పడుతోందని, పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై ప్రభుత్వాలు, సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో నిరాశ, నిస్పృహలు తొలగించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే విధానాలను ప్రభుత్వం అవలంబించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, అంబటి కృష్ణారావు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, కరిమజ్జి మల్లేశ్వరరావు, మామిడి సత్యనారాయణ, బొచ్చ కృష్ణవేణి, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, చాన్ భాష, పూడి కిరణ్, పలపాల రమేష్ కుమార్, సోడవరం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల సేవలు సమాజానికి స్ఫూర్తి

**- కళల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**

**- కళాకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవంలో విశిష్ట కళాకారులకు సన్మానం**



నవతరం ప్రతినిధి, పాతపట్నం, జూన్ 27:

పాతపట్నం నియోజకవర్గంలోని జీఎంఆర్ కన్వెన్షన్స్‌లో శనివారం నిర్వహించిన స్వర్గీయ డి.వి. సుబ్బారావు కళాకారుల సంక్షేమ సంఘం ప్రథమ వార్షికోత్సవంతో పాటు కళాకారుడు యడ్ల గోపాలరావు 6,000 ప్రదర్శనలు పూర్తి చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కళారంగానికి విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులు సమాజానికి ఆదర్శప్రాయులని కొనియాడారు. కళలను పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాకారుల కృషి సాంస్కృతిక సంపదను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం కళారంగానికి విశేష సేవలు అందించిన పలువురు కళాకారులను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కళాకారుల అభివృద్ధికి ఆయన అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు, కళాకారులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇది జెన్ జీతోనే సాధ్యం

**- ముందు తరాలకు అంత సీన్ లేదు..**



నవతరం ప్రతినిధి,

ఆఫీసుల్లో విషపూరిత పని సంస్కృతికి చెక్ పెట్టగలిగే ధైర్యం జెన్ జీ తరానికే ఉందంటూ ఒక మహిళ నెట్టింట పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ పోస్టుపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. పని ప్రదేశాల్లో విషపూరిత సంస్కృతికి చెక్ పెట్టేది జెన్ జీనేనని ఒక వ్యక్తి నెట్టింట పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. జెన్ జీ ముందు తరమైన మిలీనియల్స్‌కు అంత ధైర్యం లేదని కూడా ఆ నెటిజన్ కామెంట్ చేశారు. ఇది ప్రస్తుతం పెద్ద చర్చకు దారి తీసింది. మేనేజర్ మెప్పు పొందేందుకు ఎవరూ అతిగా పనిచేయరట. ఎవరైనా తమతో తప్పుగా ప్రవర్తిస్తే వెంటనే హెచ్‌ఆర్‌కు చెబుతారట. హెచ్‌ఆర్ కూడా జెన్‌జీకే మద్దతు తెలుపుతారట. వాళ్ల గ్రూపులో మిలినీయల్స్ ఎవరూ లేరట. మిలీనియల్స్‌కు అంత ధైర్యం ఉండదని మా కజిన్ చెప్పింది. మీరు అన్నింటిని భరించడానికి అలవాటు పడ్డారని నన్ను ఉద్దేశించి కామెంట్ చేసింది' అని ఆమె చెప్పారు. ఈ పోస్టుకు జనాల నుంచి సహజంగానే పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. జెన్ జీ తరానికి చెందిన తన బంధువు చేసిన పనిని జనాలతో షేర్ చేశారు. 'పని ప్రదేశాల్లో విషపూరిత సంస్కృతికి చెక్ పెట్టగలిగేది జెన్ జీనే అని అనుకుంటున్నాను. మా జెన్ జీ కజిన్‌తో ద్వారా ఇటీవల నాకు ఒక ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. ఇటీవల ఒక రోజు వాళ్ల ఆఫీసులో ఏసీ పనిచేయకపోతే ఉద్యోగులంతా క్యాటీన్‌లోకి వెళ్లారట.జీతాలు పెంచాల్సిన సమయంలో ఈ ఐకమత్యం మాయమై ఎవరో ఒకరు హ్యాండిస్తారని కొందరు హెచ్చరించారు. మిలీనియల్స్ నెత్తిన అప్పుల భారం, బాధ్యతలు ఉంటాయని, వారు తిరగబడే స్థితిలో లేరని మరికొందరు అన్నారు. మిలీనియల్స్ సంధి కాలంలో ఉన్నారని, యువతకు ఉండే స్వేచ్ఛ, అవకాశాలు వారికి ఉండవని మరికొందరు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం 35-45 మధ్య ఉన్న వారిని మిలీనియల్స్‌గా పిలుస్తున్న విషయం తెలిసిందే. 1997 నుంచి 2012 మధ్య పుట్టిన వారిని జెన్ జీగా పిలుస్తున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి, ఫారమ్‌లు గడువులోగా ఇవ్వాలి: ఎంపీపీ నిమ్మన దాసు

**- జింకిభద్రలో ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ**

**- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని పిలుపు**

సోంపేట, జూన్ 27:



భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లు 248, 249 పరిధిలో శనివారం ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, ఈ సందర్భంగా ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, సవరణలు, తొలగింపుల కోసం ఫారం-6, ఫారం-7, ఫారం-8 అందుబాటులో ఉన్నాయని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉంటే చట్టరీత్యా నేరమని, ఆధార్, రేషన్ కార్డు, బర్త్ సర్టిఫికేట్ లాంటి ధ్రువపత్రాలు జతచేసి గడువులోగా ఫారమ్‌లు సమర్పించాలని, మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారి పేర్లు తొలగించి దొంగ ఓట్లను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోంపేట జడ్పిటిసి ప్రతినిధి తడక యశోద జోగారావు, మాజీ సర్పంచ్ తామాడ పద్మావతి, బిఎల్ఏలు సాహుకారి జానకిరావు, బత్తుల శంకరరావు, పోకల హేమరాజు, ఎర్ర గిరి, రాజాం లక్ష్మణరావు,"హ= కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఫారమ్‌లను పంపిణీ చేసి, నింపే విధానాన్ని వివరించారు.

## హనుమంతుని సేవా తత్పరతను ఆదర్శంగా తీసుకోవాలి: మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు

**- కైజాలలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహణ**

పలాస, శుక్రవారం :



మండలంలోని కైజాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా జరగగా, ఈ పవిత్ర కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఆంజనేయ స్వామి భక్తి గురించి మాట్లాడుతూ "హనుమంతుడు ఫలితాన్ని ఆశించకుండా శ్రీరామునికి చేసిన నిస్వార్థ సేవ నేటి సమాజానికి ఆదర్శమని, సంకట సమయంలో బలంతో పాటు బుద్ధితో కార్యం సాధించిన హనుమంతుని వివేకాన్ని యువత అలవర్చుకోవాలని" పిలుపునిచ్చారు, ఆలయాన్ని పూలమాలలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో తరించారు, ఈ కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎక్స్ సర్పంచ్ బత్తిని అప్పలస్వామి, తాజా మాజీ సర్పంచ్ కొర్ల సంతు, బత్తిని వెంకట్రావు, బుడత అప్పారావు, ఎంపీటీసీ మడ్డు రాంప్రసాద్, వల్లభ వైకుంఠ రావు, అగ్రికల్చర్ బోర్డు మాజీ చైర్మన్ గొర్రెల వేణు, పి. ప్రభాకర్ రావు, డి. నాగభూషణరావు, పి. పాపారావు తదితరులు పాల్గొన్నారు.

- పత్రికా ప్రకటన

## బాధిత కుటుంబలను పరామర్శించిన - మాజీ స్పీకర్ తమ్మినేని

ఆముదాలవలస, జూన్ 27 :



ఆమదాలవలస నియోజకవర్గనికి సంబంధించి సరుబుజ్జిలి, ఆమదాలవలస పొందూరు మరియు జి సిగడాం మండలాలలో శనివారం పలు ఆత్మీయ పరామర్శలలో పాల్గొన్నా మాజీ స్పీకర్ శ్రీకాకుళం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం సరుబుజ్జిలి మండలం పెద్ద వెంకటాపురం గ్రామంలో వైయస్సార్ పార్టీ నాయకులు జల్లు చిన్నయ్య,ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన పేడాడ పెంటయ్య, పొందూరు మండలం తోలాపి గ్రామంలో పప్పల లక్ష్మణరావు కోటిపల్లి గ్రామంలో వైయస్సార్ పార్టీ కార్యకర్త లోట్టి కేశవరావు భార్య పైడితల్లి అదేవిధంగా జి సిగడాం మండలం సంత కురిటీ గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ కార్యదర్శి పిల్లల రామకృష్ణ సోదరుడు పిల్లల అప్పన్న ఇటీవల మృతి చెందారు ఆయా కుటుంబాలను శనివారం తమ్మినేని సీతారాం పరామర్శించారు అనంతరం బాధిత కుటుంబాలను మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తమ్మినేని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి దుంపల లక్ష్మణరావు రణస్థలం ఎంపీపీ మరియు శ్రీకాకుళం నియోజకవర్గ పరిశీలకులు పిన్నింటి సాయికుమార్, రణస్థలం జడ్పిటిసి సీతారాం పలాస నియోజకవర్గ పరిశీలకులు ఎన్ని ధనుంజయ్ మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at: Kranthi Publications, D.NO.2-504/1 **Aditya Nagar** Colony, Arasavilli, Srikakulam, Srikakulam dist. ANDRA PRADESH STATE -532 401, **Published at** : Kranthi Publications ,D.NO.2-504/1, Srikakulam dist, ANDRA PRADESH STATE -532 401 Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 834084777**